# 1

## పెళ్ళానికి ప్రేమలేఖ

డియర్ విమలా!

నువ్వివాళ తప్పకుండా వొస్తావని సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కి స్టేషన్ కెళ్ళాను. ఎంతమంది దిగారు. నువ్వు దిగలేదు. ఎంతకోపం వొచ్చిందో తెలుసా? నువ్వెళ్ళి వారంరోజు లైంది. రోజులూ తారీఖులూ మర్చిపోయి నట్టున్నావు. పెద్ద కబుర్లు చెప్తావుగానీ.... వుత్త పల్లెటూరి పిల్లలాగ పుట్టి ల్లంటే నువ్విలా అతుక్కుపోతావనుకోలేదు. అంత అమ్మదగ్గిర పాలుతాగే దానివి పెళ్ళెందుకు చేసుకున్నావూ? ఈ వారం రోజులూ నే నసలు సరిగ్గా అన్నం తినలేదు తెలుసా? నువ్వు చేసిపోయావుగా ఏవో పచ్చళ్ళు.... అవన్నీ అలాగే వున్నాయి. కోర్టు నించొచ్చి అన్నం వొండుకోవాలంటే బద్ధకం. 'ఈ పూటకి మానేస్తే ఏం పోయిందిలే' అని బద్ధకించి... వరసగా నాలుగు రాత్రుళ్ళు భోజనం మానేశాను. ప్రతిరోజూ ఎక్కణ్ణించో దొంగ పిల్లి వచ్చి పాలన్నీ తాగేస్తోంది. పాలగిన్ని అలమారులో పెట్టాలనుకుని మర్చిపోయి బైటికి పోతుంటాను. చెడ్డ చికాగ్గావుంది విమలా! ఇక లాభం లేదు. వెంటనే నువ్వు వొచ్చెయ్యాలి.

నీ బుచ్చిబాబు.

* * *

నా బుచ్చిబాబూ ! మైడియర్....

నీ కష్టాల ఉత్తరం అందింది. నేను వొస్తున్నానని రాయకుండా నువ్వసలు స్టేషన్ కెందుకెళ్ళావ్ ? పైగా కోపం వొచ్చిందట; కోపం. అనవసరంగా ఆర్భాటం చేసేవాళ్ళమీద నా కసలే వొస్తుంది కోపం.

నువ్వన్నది నిజమే, నే నిక్కడ రోజులూ, తారీఖులూ, అన్నీ మర్చిపోతున్నాను. కాలం మహాభారంగా గడపాల్సిన వాళ్ళకి ఆ లెక్కలన్నీ ఆర్నెల్ల తర్వాత ...ఇక్కడ మావాళ్ళతో... నా స్నేహితుల్తో అబ్బా! మళ్ళీ వీళ్ళందర్నీ వొదిలి ఎట్లా బతగ్గలనో....తెలీడం లేదు.

పెళ్ళెందుకు చేసుకున్నానా ? మొగుడుకి వేళ పట్టుకు అన్నంపెట్టి-నీళ్ళు పోసి-బబ్బోపెట్టి-పాపాయిలాగా పెంచడానికి మాత్రంకాదు. అది అమ్మదగ్గిర పాలు తాగడంకన్నా ఘోరం.

వారం రోజులు అన్నం తినలేదా ? మంచిదే ఆరోగ్యానికి-దేశానికీ కూడా-"ఈ పూట అన్నం తినకపోతే ఏం పోయిందిలే-"అని మానేశారు గదా! మర్నాడు తెలిసిందా? ఏం పోయిందో ? ఏమీపోలేదు కదూ? సర్లెండి, ఏదన్నా పోయినప్పుడు తినడం ప్రారంభిస్తే సరి. అయినా అది బద్ధకం అనుకుంటున్నారు తమరు. కాదు, ఆకలి మందగించడం మంచిది కాదు. ఆరోగ్యంగా వున్న డాక్టర్ని సంప్రదించండి.

నేను [illegible]సిన పచ్చళ్ళన్నీ అలాగే వున్నాయా ? అయితే ఫర్వాలేదు. అవి నాలుగైదు నెలల వరకూ పాడుకావు. మీకు పనికొస్తాయి.

పాలగిన్నె జాగర్తగా అలమార్లో దాచుకుంటే పోలా ? ఆ మాత్రానికీ నేను రావాలా ? పైగా పిల్లిని పట్టుకుని దొంగపిల్లి అనడమెందుకూ ? వంటింట్లో గిన్నెడుపాలు మీగడ తేలుతూ కనబడుతోంటే తాగకుండా వెళ్ళగల పిల్లి ఈ సృష్టిలో వుంటుందా? మీరు పిల్లి జన్మ ఎత్తినా వుండలేరు. అయినా....పిల్లి మాత్రం యామనుకుంటుందీ!—"హుం ! ఈ మానవుల కెంత స్వార్ధం! ఆవుల్ని మేకల్ని కట్టేసి....వాళ్ళేదో హక్కుదారుల్లాగ....సిగ్గులేకుండా పాలన్నీ పిండుకు తాగుతారు. ఎప్పుడన్నా మనం కాసిన్ని

రుచి చూస్తే....కొంపలంటుకుపోయినట్టు గోల చేస్తారు. పుట్టిళ్ళల్లో వున్న పెళ్ళాలకికూడా రాసుకుంటూ రురాయడాని కింకేమీ లేనట్టు. హి! హి! ఏం మనుషులు!" అని నవ్వుకోదా దాని ప్రియుడికి చెప్పి? ఛ! మానవజాతి నెంత అల్పం చేశావు పిల్లి దృష్టిలో: నా కిక్కడ పిల్లి మొహం చూడాలంటే చచ్చేసిగ్గు వేస్తోంది. అందుకే నే నెప్పుడూ-మనకి నోరున్నది కదాని నోరు లేని వాటి గురించి విమర్శలవీ చేయకూడదంటాను. సర్లే! ఏంచేస్తాం?

చెడ్డ చికాగ్గా వుంటోందా? రాత్రుళ్ళు స్నానం మానేసి వుంటావు. అవునా? కాకపోతే ఆ చెడ్డ చికాక్కి కారణం ఏమిటో ఆలోచిద్దాం. నేను వెంటనే వొచ్చేయాలా? ఎందుకుటా? మీ యిబ్బందుల్లో నే నివ్వగల సలహాలన్నీ ఇందులోనే రాశాను. మీ ప్రతి ఉత్తరానికీ వెంటవెంటనే రాస్తూ వుంటాను. నేను మాత్రం వెంటనే వొచ్చేయ్యడం లేదు. ఎందుకు రావాలో కారణం కనపడక.

ఉంటాను,
విమల.

* * *

డియర్ విమ్లా!

నీ తిక్క వుత్తరం అందింది. చదవడానికి సరదాగానే వుందిగానీ.... వొళ్లు మండింది. ఏ బండికి వొచ్చేదీ ఆఖర్న ఒక్క వాక్యం అన్నా రాస్తా వనుకున్నాను. అమ్మాయ్! సరదాకికూడా వేళా పాళా వుండాలి. తారీఖులూ అవీ కుదరాలి. ఎందుకు రావాలీ? ఏమిటీ? నీ వెంకిరాతలూ నువ్వూను, పోనీలే అని ఈ సారికి క్షమిస్తున్నాను. ఇంక జాప్యం చెయ్యక వొచ్చెయి. అసలు నిన్ను పంపడం నాది బుద్ధితక్కువై పోయింది. "పోనీలే ఓసారి పుట్టింటి వాళ్ళని చూసి వొస్తుం"దని జాలిపడి పంపితే—నన్నేడిపించే దొంగవెధవపిల్లిని వెనకేసుకొస్తావూ? నువ్వింక ఈ జన్మలో మీ వూరు మొహం చూడ గలవేమో ఆలోచించుకో.

పచ్చళ్ళన్నీ అయిపోయాయి. నిన్న కూచుని తినేసి.... ఖాళీజాడీలు ఓ మూల పారేశా, నిన్నటిన్నుంచీ హోటల్ భోజనం ప్రారంభించా. అయినా, నాకా తిండి పడదని నీకు తెలుసు. నేను చదువుకునే రోజుల్లో హోటల్ కూడు తిని చచ్చే జబ్బుపడి బయటపడ్డ స్టోరీ నీకు గుర్తుంది కదూ?— ఇవతల నేనింత ఇబ్బంది పడుతోంటే-నువ్వక్కడ హాయిగా దర్జాగా కూచుని.... ఎందుకు రావాలని ప్రశ్నలేమిటి? తల్చుకుంటే వొళ్ళు మండి పోతోంది. భర్త దగ్గిరకి భార్య ఎందుకు రావాలీ ఏమిటి? అది నీ ధర్మం. కర్తవ్యం. బాధ్యత. విధి. డ్యూటి. తెలిసిందా? సిగ్గొచ్చిందా? నోరు మూసుకొని వొచ్చెయి. నీ తలతిక్క నేనింక సహించదల్చుకోలేదు. ఇల్లంతా ఎలా వుందో తెలుసా? వొచ్చి చూడు ఏబండి కొచ్చేదీ రాయి.

నీ అగ్నిసాక్షి భర్త

బుచ్చిబాబు

* * *

నా అగ్ని సాక్షి భర్తకి....

నా ఏకైక సొంత భర్తకి....

నేను ఏ బండికీ రావడంలేదు. ఎందుకు రావాలో మళ్ళీ తెలీలేదు. సరే! నీ వుత్తరానికి వరసక్రమంలో జవాబు రాస్తాను. నేను సరదాకి తిక్క వుత్తరం రాశానని తమరు అపార్థం చేసుకున్నారు. (1) అది సరదాకి రాసిందికాదు. చాలా అత్యవసరంగా రాసింది. (2) అది తిక్కవుత్తరమూ కాదు. నీకలా అనిపించడం నీ దురదృష్టం.

పుట్టింటికి నన్ను నువ్వు పంపించడం ఏమిటి? ఇన్సల్ట్!- 'నన్ను పంపడానికీ, మానడానికీ ఎవడివి నువ్వు?'- అని అడగాలని బుద్ధి పుడుతోంది. పోనీ బాగా మర్యాదతో-గౌరవంతో 'ఎవరు తమరూ?' అంటున్నాను. చిన్నప్పుడు మా గ్రామరు మేష్టారి మీదపడి జుట్టు పీకాలన్నంత కోపం వొచ్చేది. ఏక వచనాన్ని బహువచనంలోకీ-బహువచనాన్ని ఏక

పచనంలోకి తెగ రాయించేవా రాయన. అది ఇంత అవసరానికి పనికొస్తుం దని నా కేం తెలుసూ?

పచ్చళ్లన్నీ అయిపోయాయా? హోటల్ తిండి మొదలు పెట్టారుగా? ఫర్వాలేదు. ఆ జాడీలన్నీ మూల పారేసి వుంచకపోతే కడిగేసి దాచెయ్యరాదూ? ఇంట్లో తిరగడానికి మీకే సుఖంగా వుంటుంది.

అవును మీకు హోటల్ భోజనం పడక జబ్బుచేసిన స్టోరీ నాకు గుర్తుంది. నాకు మీ వూరి పంపు నీళ్లు పడక....అస్తమానూ వేడిచేసే సంగతీ-కాల్టెక్స్‌వాళ్ళు వొదిలే గ్యాసు కంపు పడక....ఇంట్లోని సిగరెట్ల పొగ పడక-వికారపెట్టే ఘట్టాలన్నీ నీకూ గుర్తున్నాయి కదూ! నీకు వొండి పెట్టడం కోసం నా ఆరోగ్యం పాడుచేసుకొనేంత త్యాగం ఎందుకు చెయాలి నేను? నా ధర్మమా? నా కర్తవ్యమా?.... అయితే అదేదో నేను చూసుకుంటాను. నా ధర్మం నాకు తెలీదని నువ్వెందు కనుకుంటావూ? ధర్మాలూ... బాధ్యతలూ బోధిస్తే వస్తాయా? అంతరంగంలోంచి పొంగుకు రావాలిగానీ. "గాలి పీల్చడం నా ధర్మం, నా విధి." అనుకుని గాలి పీలుస్తామా? పీల్చకుండా బ్రతకలేకగానీ. అంత సహజధర్మాలే ధర్మాలుగానీ-భర్తకి వొంట వొండడం, జాడీలు తోమడం, పిల్లల్ని తోలడం కూడా ధర్మాలేనా?- ఉత్త దరిద్రపు చాకిరీగానీ.

ఇల్లంతా ఎలావుందో చూడ్డానికి నే రాదల్చుకోలేదు. కావాలంటే ఫొటోలు తీసి పంపించు. నా సలహాలు రాస్తాను. నువ్వు నివసించే యిల్లు....నువ్వే పరిశుభ్రంగా వుంచుకుంటే నువ్వే సుఖపడతావు.

నే నిక్కడ చాలా సుఖంగా వున్నాను. మా అమ్మ నాకెంతో ఇష్టమైన కూరలన్నీ వొండిపెడుతోంది. మా అన్నయ్య సినిమాలకి తీసుకెళ్తున్నాడు. నా స్నేహితులతో కాలక్షేపం చేస్తూ చాలా హాయిగా వున్నాను ఇవన్నీ వొదిలిపెట్టి నేను రావాలిట పాపం. ఆశ.

ఇక్కడే వుంటాను
విమల.

* * *

భార్యామణికి....

నీ వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది! ఎంతో మంచివాణ్ణి నాకే కోపం తెప్పిస్తున్నావు. ఏదో మొదటి ఉత్తరం సరదాకి రాశావుకదా అనుకున్నాను. ఇవ్వాల్టికి రెండు వారాలు నువ్వెళ్ళి. ఏమిటీ తమాషా? ఇంత మొండిదాని వయ్యావేం? పాడు వూరు. మీ వూరు వాళ్లంతా అంతేనా? కేకలేసి పంపించరూ? ఆర్నెల్లిక్కడా.... ఆర్నెల్లక్కడా వుంటావా ఏమిటి?

సరే! నా కష్టచరిత్ర రాస్తున్నాను చూడు. ఇల్లంతా సర్దుకోమన్నావు కదూ? ఆపనే చేద్దామని నిన్న హఠాత్తుగా లేచాను. వీధి తలుపులు మూసేశాను. ఇల్లు అందంగా సర్ది బార్లా తీసి అందర్నీ పిలుద్దామనీ, బట్టలన్నీ ఓ మూలవి తీసి ఇంకో మూలకి విసిరేశాను. పత్రికలూ, పుస్తకాలూ దులిపి మళ్ళా బల్లనిండా పెట్టాను. మొన్న నాలుగురోజులు పనిమనిషి రాలేదు. ఎంత కోపం వచ్చిందంటే దాన్ని పనిలోంచి తీసేద్దామనుకున్నాను. అసలు దాన్ని తీసెయ్యడం ఎలాగా?... సర్దడం సంగతి కదూ? అబ్బ! చీపురు కోసం ఎంత వెదికా ననుకున్నావూ? తలుపుల వెనక—మంచాల వెనక—కుర్చీల వెనక—గోడల వెనక-నా వెనక.... చీపుర్ని ఇంత రహస్యంగా.... ఇంత నేర్పుగా దాచగల పనిమనిషిని మనం వొదులుకోవడం మంచిదికాదు. అప్పు డేం చేశానో తెలుసా? పెరట్లోకి పోయి పక్కింటివాళ్ళ గోడమీంచి తొంగిచూసి—"చీపురుందాండీ?"- అనేశా. ఆవిడ అదోలా నవ్వి (ప్రేమగా అనుకునేవు) జాలిగా నవ్వి—"ఎందుకండీ?" అంది. అడిగింది ఇవ్వరాదూ? ఎందుకుట. చీపురెందుకూ?—"అబ్బే! ఏం లేదండీ! ఊరికేనే"- అన్నా గడుస్తనంగా. నమ్మేసినట్టుంది. నవ్వుతూ ఇచ్చింది. చీపురు దొరగ్గానే కావలించుకో బుద్దేసింది విష్లూ! అంతమెత్తగా.... పట్టుకుచ్చులా ఉందనుకో. ఎక్కడ కొన్నారో అడిగి అలాంటివి ఓ డజను కొనిపెట్టెయ్యనా యింట్లో? వొద్దంటావా?

మొన్నేమైందో తెలుసా? తాళంచెవి ఎక్కడో పారేశాను. ఇంజనీర్ని తీసుకొచ్చి తాళం బద్దలుగొట్టాల్సి వొచ్చింది. నువ్వే వుంటే ఈ గోలంతా లేదుకదా?

చీకట్నే లేసి పాలు తీసుకోవడం మహాకష్టంగా వుంది విమలా !— మొన్నాదివారం మిట్టమధ్యాన్నం నేను గాఢంగా నిద్రపోతుంటే—పక్కింటి వాళ్ల పిల్ల దబదబా తలుపులు బాదేసి....లేపేసి— "మంచి జీడి గింజలు వొచ్చాయి. చవగ్గా ఇస్తున్నాడు. మా బమ్మ కొంటోంది. మీకూ కావాలేమో అడగమంది."— అని తెగ నస పెట్టింది. నాకేం తెలుసు ? హాయిగా జీడి పప్పు కొనుక్కోక ఈ గింజ లెవడు కాలుస్తాడని నువ్వు మండిపడితే ? హడలిపోయి వొద్దు పొమ్మన్నాను. ఆ మర్నాడు మళ్ళి కుంకుడుకాయల గోల ! ఎవడో మంచికాయలు తెస్తానన్నాట్ట కొనాలా ? కొనాలంటే రాయి. అసలు రాయడం ఏమిటి? వొచ్చెయ్యి. పెళ్ళాం పుట్టింటికెళ్ళి రానని మొండి కేస్తే...."హఠాత్తుగా కుంకుడుకాయాలు అమ్మొస్తే" కొనాలో అక్కర్లేదో మా అమ్మ చెప్పలేదు. ఏ బండి కొచ్చేదీ రాయక్కర్లేదులే. నీకిష్టం అయితే గూడ్సులో అన్నా వొచ్చేస్తావు.

తాజాకలం :— నీకోసం అందమైన తెల్లనిచీర కొనివుంచాను. సన్న జాజులంత చన్నపువ్వుల బార్డరు. నీకు చాలా నచ్చుతుంది. నామాట నమ్మక పోతే వొచ్చిచూడు. మళ్ళి వెర్రిమొర్రి వుత్తరం వ్రాయకు సుమా?

నీ
బుచ్చిబాబు

* * *

డియర్ బుచ్చిబాబూ !

నువ్వు రాసిన ఈ ఉత్తరంకూడా నాకు చాలా నిరాశ కలిగించింది. ఇక ఈ చెత్త ఉత్తరాలు నేను చదువలేను. "మీ ఆయన తెగ రాస్తున్నాడు

వెళ్ళిపోతావా?" అన్నారు నా ఫ్రెండ్సు "అబ్బే! ఎందుకు వెళతాను" అన్నాను నేను. అవును. ఎందుకు రావాలీ! కుంకుడు కాయలూ, జీడిగింజలూ కొనాలో లేదో తేల్చడానికేగా? ఏం ఫర్వాలేదు. కొనమనిరాస్తే సరిపోలా? కొనక్కర్లేదని రాస్తే సరిపోలా? ఈ మాత్రానికే అర్జంటుగా బయల్దేరాలా? సిగ్గుచేటు.

పక్కింటివాళ్ళ చీపు రిచ్చేశావా? చీపుర్ని అంత గొప్పగా వర్ణించిన నీ రసికత్వానికి నా జోహార్లు. అయినా అది పక్కింటివాళ్ళ చీపురదృష్టం. మన చీపురన్నా కాదు. పక్కింటామె నిన్ను చూసి ప్రేమగా నవ్వనందుకు నాకు చాలా అవమానంగా వుంది. పైగా, జాలిగా నవ్వినందుకు కోపంగా వుంది. సరే! నే నింక నీ దగ్గిరికి రానండీ భర్తగారూ! మా వూళ్ళోవాళ్ళు కేకలేసి కాపరాలు చేయించరు. మొన్ననే వో లాయరుతో సంప్రదించాను. నా సొంత అగ్నిసాక్షి భర్తకు విడాకు లిచ్చేందుకు.

"ఏమిటీ కథ? కొడతాడా? తిడతాడా?–" అన్నాడు. "కొట్టాలా? తిట్టాలా?.... పెళ్ళయిన దగ్గిర్నించీ ఆర్నెల్ల వరకూ భర్తనే అంటిపెట్టుకుని వుండి ...కొత్తగా పుట్టింటికి వెళ్ళిన పెళ్ళానికి– "ఇంట్లో దుమ్ము తుడవాలి. కుంకుడుకాయలు కొనాలి. పిల్లి రాకుండా తాళాలు పోకుండా–ఇల్లు కాపలా కాయాలి. చీకట్నే లేచి పాలు తీసుకోవాలి. ఇలాంటి పనులన్నీ వుంటాయి కాబట్టి వొచ్చేయి" అని అవమానించే ఉత్తరాలు రాస్తేచాలదా? పైగా చీర కొన్నాట్ట; చీరలకోసం, గాజులకోసం పడిచచ్చే రకం అన్నమాట నేను. కావాలంటే నాకొచ్చిన ఉత్తరా లన్నీ కోర్టులో పెడతాను. విడాకు లడగడానికి ఇంతకన్నా బాధలేం వొచ్చిపడాలి?" అన్నాను.

ఆ లాయరు నిర్మోహమాటంగా— "చాలదు. జడ్జీ వొప్పుకోడు" అన్నాడు.

"ఎందుకొప్పుకోడు? కాస్త శృంగారభావాలుగల ఆడపిల్ల .... ఇలాంటి మొద్దు మొగుడితో ఎలా కాపరం చెయ్యగలదనుకుంటాడు" అని సూటిగా అడిగాను.

"అంతే. చెయ్యాలి. వొకరిలోట్లు వొకరు క్షమించాలి. సరిదిద్దుకోవాలి" అన్నాడు.

"ఏవిటీ? నా మొగుణ్ణా? సరిదిద్దడమా?" భలే! నా కెంత నవ్వొచ్చిందంటే–నవ్వితే నాకేం కష్టాలు లేవనుకుంటాడని....సినిమాలోలాగా ఏడ్చే మొహంతో–

"ముందు మీరీ ఉత్తరాలు చదివి మాట్లాడండి,"–అని ఆ చెత్తంతా ఆయన మొహాన పారేశాను. అన్నీ చదివి ముసిముసినవ్వులు నవ్వాడు.

"అలా నవ్వడంకాదు. నాకు అర్జంటుగా విడాకు లిప్పించండి" అని పోట్లాడాను.

"అలా వీల్లేదమ్మాయ్! మన న్యాయశాస్త్రాలు వొప్పవు" అన్నాడు మహాకర్కశంగా. నా కొళ్ళుమండి–"వొప్పవూ? వొప్పకపోతే పొమ్మను. మీ న్యాయశాస్త్రాలన్నీ కలిసి నన్నెలా మొగుడి దగ్గిరికి పంపిస్తాయో నేనూ చూస్తాను" అని సవాల్‌చేసి వొచ్చేశాను. అసలీ లాయర్లకీ–జడ్జీలకీ–ఎవ్వరికీ పెళ్లానికెలాంటి ఉత్తరాలు రాయాలో తెలీదనే నా గాఢనమ్మకం. లేకపోతే నా బాధెందు కర్థంకాదూ? తపనతో స్పందించే వొక హృదయానికి న్యాయం చెయ్యలేనివన్నీ న్యాయశాస్త్రాలేనా? ఉత్త అన్యాయశాస్త్రాలుగాని ...

ఇక నన్ను రమ్మని రాయకు.

ఎప్పటికీ నీదికాని
విమల.

* * *

వెయ్యేళ్ళకీ....
వెయ్యి జన్మలకీ....ఎప్పటికీ....
నాదే అయిన విమలకు....

నన్ను క్షమించు విమలా! నేను మహామూర్ఖుణ్ణి. నిన్నెంత బాధ పెట్టాను నా అసహ్యపు రాతలతో. నీ సున్నితమైన మనసు....ఎంత గాయ

పరిచాను. ఇప్పుడు తల్చుకుంటే నాకెంత సిగ్గుగా వుందో నీకు తెలీదు విమలా! నువ్వు లేని ఈ కాలం అసలు నాకు గడిచిందా?—సంభించింది గానీ.... నీ ఎడబాటు యింత భారంగా వుంటుందని నాకు ముందే అర్థమైతే-నిన్ను వెళ్ళవద్దని బ్రతిమాలుకునేవాణ్ణి విమలా! నా మీద జాలి కలిగి తొందరగా వొస్తావుకదా అని లేని కష్టాలన్నీ సృష్టించి రాశాను. రాజమార్గం వదిలేసి.... తప్పుదారులు తొక్కాను. అది నా అజ్ఞానమేగాని.... నీకు తక్కువ విలువ కల్పించలేదు విమలా!

అసలు నువ్వీ ఇంట్లో నన్ను కూర్చోబెట్టి, నా రుచికోసం, నా సౌకర్యం కోసం, తగని పనులన్నీ కల్పించుకుని చేసి చేసి, విసిగెత్తిపోయావేమో ననిపించింది ఎన్నోసార్లు. నీకు సహాయంచేసి నీ శ్రమ పంచుకున్నట్టు నా కేమీ గుర్తులేదు. ఇక్కడ జీవితం నీకు భారంగా వుందేమో-నా ప్రవర్తనవల్ల నీ కేమీ ఆనందం కలగటంలేదేమోనని వొకటే ఆలోచనగా వుంది నాకు.

నీకక్కడ సంతోషంగావుంటే ఎన్నాళ్ళయినా వుండు విమలా! నే నేమీ ఇబ్బందిపడటంలేదు. కానీ.... నే ననుభవిస్తోన్న గొప్పకష్టం నీ ఎడబాటే. నువ్వు నన్నింత వశం చేసుకున్నావని నాకింతవరకూ తెలీదు. నా శాంతి.... నా సుఖం.... నా ఆనందం.... నా సమస్తం నువ్వు పట్టుకుపోయావు. అసలు నువ్వు నా జీవితంలోకి రానప్పుడు నే నెలా జీవించానో, ఎందుకు జీవించానో—ఇప్పుడర్థం కాదు. నిన్ను చూస్తూ వుంటే ఎప్పుడూ ఏదో సంతోషంతో—నాకే అర్థంకాని ఏదో ఆనంద పారవశ్యంతో ఓలలాడుతూ వుంటాను.

మొన్న పౌర్ణమినాడు నువ్వులేక పోయినా నాకు బీచికే వెళ్ళాలనిపించింది. చాలాసేపు కూచున్నాను. బాగా రాత్రి అయింది. అందరూ వెళ్ళిపోయారు. సముద్రపొడ్డున నే నొక్కణ్ణి. ఎంత వొంటరితనం! నిజంగా భయం వేసింది. అలాగే కూచున్నాను. సముద్రంనిండా ఎంత వెన్నెల. దాన్ని చూసి సముద్రానికెంత పొంగు. అసూయ వేసింది వెన్నెల అందం

బొత్తిగా అనుభవించలేని మూర్ఖుణ్ణి అయ్యాను. నా మనసంతా నీది చేసుకుని....నా ఆలోచన నిండా నువ్వే నిండి....ఎక్కడా నిలబడనివ్వక ఏమీ తోచనివ్వక ఉత్త వెర్రివాణ్ణి చేశావు.

నువ్వెందుకు తిరస్కరిస్తున్నావో ఆలోచిస్తే....నీ అశాంతి చాలా ఆలస్యంగా అర్థమైంది విమలా! నీమీద నా ప్రేమని విని నువ్వెంత ఆనందిస్తావో....గ్రహించలేని మందమతిని, నీ అపారమైన కరుణతో క్షమించు విమలా! నాలో అణువణువూ ఒక్కొక్క హృదయమై.... నిన్ను ప్రేమిస్తోంది. ఒక్కొక్క శరీరమై నిన్ను కాంక్షిస్తోంది. ఈ ప్రేమనీ....ఈ తీవ్రకాంక్షనీ మాటలలో చెప్పటం ఎంత అసంభవం నాకు!

నీ తల్లి చల్లని ప్రేమకన్నా, నీ స్నేహితుల మమకారం కన్నా.... విలువైన ఆనందం నేనేమీ ఇవ్వలేను. కానీ నేను నీవాణ్ణి. నీ ప్రణయార్థిని నీ మనోమందిరం ముందు నిలబడి....ప్రతిదినమూ-ప్రతిక్షణమూ—నీ ప్రేమకోసం....ప్రార్థిస్తాను. నువ్వు భిక్ష వేసినా-వెయ్యకపోయినా, ఏ కారణం చేతనన్నా మనం విడిపోతామేమో! ఇంక ఒక్కసారికూడా నిన్ను చూడనేమో నని ఎందుకో చాలా దిగులు కలుగుతోంది. జరిగిందంతా తియ్యని కలేమో--అసలు నాకు నీతో ఏమీ స్నేహం లేదేమో అన్నంత భ్రమ కలుగుతోంది. నిజంగా మనం మళ్ళీ కలుసుకోమా? అలా ఎన్నడూ జరగదుకదూ విమలా?

నీనుంచి ఇన్నాళ్ళు దూరంచేస్తే నేనెలా వుండగల ననుకున్నావు?- ఎప్పుడూ నన్ను ప్రేమగా చూసే నీ అందమైన కళ్ళు-మధురంగా నన్ను తాకే నీ ముద్దుచెక్కిళ్ళు-నిద్రలో నాచుట్టూ నీ వెచ్చని కౌగిళ్ళు-నా కెంతో హాయి కలిగించే నీ జుట్టు పరిమళాలు-నీ నవ్వులు-నీ కవ్వింపులు-నన్ను తన్మయుణ్ణిచేసే నీ సామీప్యమూ-అన్నీ నాకు ప్రసాదించటానికి రా విమలా!

నీ మధుర ప్రేమాలింగనంలో నన్ను తరింపచెయ్యటానికి రా విమలా!

క్షణక్షణమూ ఆశతో—

నిరీక్షణతో—

నీ ప్రేమార్థి.

బుచ్చిబాబు.

* * *

ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం—

"ఒకగంటలో నేను మెయిల్‌కి బయలుదేరుతున్నాను.

నీ విమల."

(1971 ఏప్రిల్ "వసుధ" మాసపత్రిక నుంచి)